క్లుప్తంగా

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సోంపేట: మండలంలోని జింకిభద్ర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. నేత్రాల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆప్తాలమిస్టు లక్ష్మణరావు అన్నారు. ప్రధాన ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, ఆరోగ్య సిబ్బంది కళావతి, నోములమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ చేస్తున్న దృశ్యం

కంచిలి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పాఠశాల స్థాయి విద్యను మధ్యలో నిలిపివేసిన వారికి దూరవిద్యా విధానంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో దూర విద్యావిధానం ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసేందుకు అర్హతలపై సచివాలయాల సంక్షేమ విద్యాసహాయకులకు, వెలుగు సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 27వ తేదీ గడవున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా లేదా, ఇచ్ఛాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

23 నుంచి గ్రామసభలు

కోటబొమ్మాళి: ఉపాధి పనులను గుర్తించేందుకు ఈనెల 23వ తేదీ నుంచి జిల్లాలోని 30 మండలాల్లో పంచాయతీల్లోనూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు సోమవారం తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవోలు, డ్వామా ఏపీడీ, ఏపీఓలకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అన్ని విభాగాల సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామసభలు నిర్వహించి పనులను గుర్తించాలన్నారు. మౌలిక సదుపాలయాల కల్పన కోసం అవసరమైన మెటీరియల్ పొందడానికి కూడా గ్రామ సభ ఆమోదం తీసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

కాశీబుగ్గ: మందస మండలం అంబుగాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి చంద్రశేఖర్ ఆకస్మికంగా మృతి చెందారు. రాజకీయాల్లో చురుకుగా ఉండే ఆయన మరణంపై పార్టీ శ్రేణులు విచారం వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ భార్య లత అంబుగాం సర్పంచ్‌గా పని చేశారు. ఈయన మృతిపై సర్పంచ్ తిరునగరి వెంకాయమ్మ, నవరయ్య, పలువురు పార్టీ నాయకులు సంతాపం తెలియజేశారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సత్కారం



సీనియర్ ఫొటోగ్రాఫర్ హేమసుందర్ దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

కాశీబుగ్గ: మండల కేంద్రం మందసలోని ఓ కల్యాణ మండపంలో అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. పలాస పరిసర ప్రాంతాలకు చెందిన సృష్టి ఐక్యత ఫొటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి నియోజవర్గాలకు చెందిన సభ్యులు హాజరయ్యారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లు, కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భవానీశంకర్ కుటుంబానికి పరామర్శ



పరామర్శలో బాబూరావు, రవిచంద్ర

కాశీబుగ్గ: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పలాస సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ కుటుంబాన్ని పలువురు సోమవారం పరామర్శించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వజ్జ బాబురావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిర్ల రవిచంద్ర తదితరులు భవానీశంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. డబ్బీరు నాగు, అంబిక ప్రసాద్, యవ్వారి మోహనరావు, చంద్రమౌళి, జగదీష్‌పండా, ప్రసాద్, రామచంద్రరాజు ఉన్నారు.

• సాయం..



కంచిలి మండలంలోని కర్తలి గ్రామానికి చెందిన పైల తాతయ్య, ధనలక్ష్మిల మూడు సంవత్సరాల కుమారుడు రిషికేశ్ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పలువురు బాలుడు వైద్యానికి ముందుకు వస్తున్నారు. ఇందులో భాగా కంచిలి విజ్ఞాన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ. 20 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని రిషికేశ్ కుటుంబ సభ్యులకు సోమవారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. - కంచిలి

• సన్మానం..



యోగా గురువుకు శిష్యులు సన్మానం చేసి అభిమానాన్ని చాటుకున్నారు. జంధ్యాల పౌర్ణమి సందర్భంగా సోంపేట మండలం బెంకిలి గ్రామ పంచాయతీ కురాస్వామి సాధు మెట్ట వద్ద యోగా గురువు కాశి సూర్యనారాయణను అభ్యాసకులు దుశ్శాలువతో సోమవారం సత్కరించారు. యోగా గురువు మాట్లాడుతూ.. యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. యోగాపై ప్రతిఒక్కరూ దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తామాడ చంద్రశేఖర్, సాహుకారి జాని, యర్ర గాంధీ, పొందూరు పూర్ణచంద్రరావు, బైరి కుమార స్వామి, యర్ర ఉపేంద్రరావు పాల్గొన్నారు. -సోంపేట

• పుస్తకావిష్కరణ



టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. సీఎస్ఈ, సీఎస్ఎం విభాగాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు జి.విజయకుమార్, వి.యమున రచించిన 'ఆపరేటింగ్ సిస్టమ్' పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఆధారిత కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్లు డి.శ్రీరాములు, వై.రమేష్, టి.మురళీమోహన్ పాల్గొన్నారు. -టెక్కలి

నాడు ఘనం-నేడు శిథిలం!

- అక్కరకు రాని ఆర్‌అండ్‌బీ బంగ్లా
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆవరంలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన వాహనాలు

ఇచ్ఛాపురం రూరల్: వందేళ్ల చరిత్ర.. మర్రి చెన్నారెడ్డి, ఎన్టీ రామారావు వంటి ముఖ్యమంత్రులు, భగవాన్‌దాస్, ఎస్.రాఘవ, ఎస్.సంతానం, బి.దానం వంటి జిల్లా కలెక్టర్లు, గౌతు లచ్చన్న, ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం వంటి రాజకీయ నాయకులు బస చేసిన బంగ్లా ఇది. నిత్యం ప్రముఖులు, అధికారులు, ప్రజలతో కళకళలాడే ఈ ఆర్‌అండ్‌బీ బంగ్లా నేడు శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే ప్రమాదంలో ఉంది. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ కార్యాలయానికి కూత వేటు దూరంలో విస్తారంగా ఉన్న 2.80 ఎకరాల్లో ఆర్‌అండ్‌బీ బంగ్లాను వందేళ్ల క్రితం నిర్మించారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఇచ్ఛాపురం ఉండటంతో పాటు రైల్వే స్టేషన్ ఉండటంతో అప్పట్లో అధికారులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు బస చేసేందుకు అప్పట్లో బంగ్లాను కట్టారు. సంబంధిత అధికారులు వారానికి మూడు రోజులు ఈ బంగ్లాకు అందుబాటులో ఉండటంతో విద్యార్థులు డిస్టెన్స్ సర్టిఫికెట్లకు సోంపేట వెళ్లే పరిస్థితి ఉండేది కాదు. రానురాను అధికారులు, రాజకీయ నాయకుల తాకిడి తగ్గడంతో పాటు బంగ్లా శిథిలావస్థకు చేరుకోవడంతో గత పదిహేనేళ్లుగా ఈ బంగ్లాను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పట్టణంలో బాలికల జూనియర్ కళాశాలకు సొంత భవనం, స్థలం లేకపోవడంతో ఆర్‌అండ్‌బీ బంగ్లాకు చెందిన 2.80 ఎకరాల్లో ఒక ఎకరం స్థలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రెండేళ్ల క్రితం బాలికల జూనియర్ కళాశాలను కట్టారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం!

పెద్దగా జనసంచారం లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు ఆర్‌అండ్‌బీ బంగ్లా అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో మందుబాబులు దర్జాగా ఈ పరిసరాలను వినియోగించుకుంటున్నారు. అంతే కాకుండా ఇదే అదనుగా భావించిన కొంతమంది ప్రైవేటు వ్యక్తులు లారీలు, పొక్లయినర్లు, ట్రాక్టర్లతో పాటు ఇసుక, రాళ్లను భద్రపరిచేందుకు ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణను వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బంగ్లాకు భద్రత కల్పించే చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న బంగ్లా



మందుబాబులు తాగి పడేసిన సారా ప్యాకెట్లు, మద్యం బాటిళ్లు

కొత్త భవనానికి ప్రతిపాదనలు

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఆర్‌అండ్ స్థాయి కమిటీ బృందం వచ్చి బంగ్లాను పరిశీలించారు. పాత భవనాన్ని తొలగించేందుకు, సుమారు రూ.3 కోట్లతో కొత్త బంగ్లా, చుట్టూ రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు.

– మోహనరావు, జేఈ. ఆర్‌అండ్‌బీ

అక్క చెల్లమ్మల కోసమే దిశ చట్టం



మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు

కాశీబుగ్గ: అక్క చెల్లెమ్మలకు అండగా ఉండాలనే ఉద్దేశంతోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశ చట్టాన్ని తీసుకొచ్చారని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పలాసలోని తన స్వగృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అక్క చెల్లెమ్మలకు శుభాకాంక్షల తెలియజేశారు. చెల్లెమ్మలకు ఎటువంటి హాని కలుగకూడదనే దిశ చట్టాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని గుర్తు చేశారు. కోల్‌కత్తాలో ఓ వైద్యురాలిపై జరిగిన సంఘటన తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఈ ఘటనపై 14 రోజులలో దర్యాప్తు, 21 రోజులలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి నిందితులకు శిక్షపడేలా చేసి కుటుంబానికి న్యాయం జరగాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి సతీమణి శ్రీదేవి, కుమారులు ఆర్నవ్ వర్మ, ఆరవ్ వర్మలు ఉన్నారు.

రహదారిని అడ్డుకుంటున్నారని ఫిర్యాదు



రహదారిని అడ్డుకుంటున్నారని చెబుతున్న మహిళలు

ఇచ్ఛాపురం రూరల్: తరతరాల నుంచి తమ కుటుంబ సభ్యులు రాకపోకలు సాగించే రహదారిని కావాలనే అడ్డుకుంటున్నారని సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సన్యాసి పుట్టుగ గ్రామం కొండి వీధిలో సుమారు పది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. వీరంతా దిగువ వీధికి రాకపోకలు సాగించేందుకు గ్రామ కంఠం సర్వే నంబర్ 3921ను వినియోగిస్తూ వస్తున్నారు. అయితే అదే గ్రామం దిగువ వీధికి చెందిన నీలాపు బోమరాజు, రోకళ్ల వెంకటరావు, రోకళ్ల లింగరాజు, రోకల్ల కుమారస్వామిలు తమను ఆ రహదారి గుండా నడవనీయకుండా సిమెంట్‌తో గోడ కట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వినత పత్రం అందజేశారు.

పని సర్దుబాటు నిలిపివేయాలి

- ఉపాధ్యాయుల డిమాండ్



టెక్కలి: ఎంఈవోలకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో సంఘ నాయకులు



కవిటి: ఎంఈవో ధనంజయమజ్జికి వినతి అందజేస్తున్న ఉపాధ్యాయులు



కాశీబుగ్గ: మందస ఎంఈవోలకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు

టెక్కలి: ఉపాధ్యాయుల డిమాండ్లు పరిష్కరించేంత వరకు పని సర్దుబాటు ప్రక్రియ నిలిపి వేయాలని ఫ్యాప్టో కమిటీ పిలుపునిచ్చారు. సోమవారం పని సర్దుబాటు ప్రక్రియను బహిష్కరిస్తూ టెక్కలి ఎంఈవోలు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావుకు వినతిపత్రం అందజేశారు. సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతున్న క్రమంలో సర్దుబాటు ప్రక్రియను వాయిదా వేయాలని, ఆగస్టు 16 నాటి ఎన్‌రోల్‌మెంట్‌ని, సీనియారిటీ లెక్కింపులో మెరిట్ కమ్ రోస్టర్‌ను, సీనియర్ ఆప్షన్లను పరిగణలోకి తీసుకోవాలని, ఉన్నత పాఠశాలలో ఖాళీలు భర్తీ చేయాలని, ప్రాథమికోన్నత పాఠశాలలో లాంగ్వేజీ పండిట్లను కొనసాగించాలని తదితర సుమారు ఎనిమిది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సంఘ నాయకులు పి.గణపతిరావు, టి.వైకుంఠరావు, బి.నేతాజీ, జి.శ్రీనివాస్, ఆదినారాయణ, కె.వేణుగోపాలరావు, బి.కృష్ణారావు, సురేష్, మోహన్ పాల్గొన్నారు.

కవిటి: సమస్యలు పరిష్కరించేవరకూ పని సర్దుబాటు నిలిపి వేయాలని ఫ్యాప్టో, జాక్టో, పోర్టో సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఈవో ధనంజయమజ్జికి వినతిపత్రాన్ని అందించారు.

ఉపాధ్యాయులు పనిసర్దుబాటులో అసంగతాలను తొలగించాలి

కాశీబుగ్గ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరతూ మందస ఎంఈవోలు లక్ష్మణరావు, ఎం.భాస్కరరావులకు ఉపాధ్యయులు వినతిపత్రాన్ని అందించారు. ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు గుంట కోదండరావు, గవ్వ భీమారావు, మురళీ, రవికుమార్, దుర్గాప్రసాద్, జగదీష్ బడిత్య, ప్రభాకర్ పట్నాయక్, బమ్మిడి భైరాగి, రాము, మాధవరావు, ఎం చిత్రసేను, సత్యానంద, శాంతి, కృష్ణారావు, ప్రసాద్, పితాంబరమాలి ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



భారీ వాహనాలకు ఫైన్ వేస్తున్న పట్టణ ఎస్సై సత్యన్నారాయణ

ఇచ్ఛాపురం: నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని ఇచ్ఛాపురం పట్టణ ఎస్సై వి సత్యన్నారాయణ అన్నారు. రత్తకన్న రోడ్‌లో మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే ఎల్‌సీ గేట్ సమీపంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్దేశిత సమయంలో కాకుండా వేరే సమయంలో పట్టణంలోని ప్రవేశించిన రెండు భారీ వాహనాలకు ఎస్సై జరిమానా విధించారు. అలాగే రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణరావు మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. 22 వాహనాలకు జరిమానా విధించినట్టు రూరల్ ఎస్సై తెలిపారు.

ఘనంగా సంతోషిమాత తిరువీధోత్సవం



సంతోషిమాతను ఊరేగిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గ ఎల్‌సీగేటు పాత జాతీయ రహదారి పక్కన ఉన్న సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఆలయంలో గత 50 ఏళ్లగా సంతోషిమాత ఆలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా పూజాదీ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగరా సోమవారం సాయంత్రం తిరువీధిని ఘనంగా నిర్వహించారు.

తెప్పలకు తెలుగు భాషా పురస్కారం ప్రదానం

కాశీబుగ్గ: సాహితీ, సాంస్కృతిక, సామాజిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అంబేడ్కర్ సామాజిక భవనంలో తెలుగు భాషా దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. 138వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో భాగంగా పలాసకు చెందిన నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు, కవిశ్రేష్ఠ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి తెలుగు భాషా పురస్కారాన్ని నిర్వాహకులు ప్రదానం చేశారు. స్వర్గం కన్నా నా భారత్ మిన్న అను కవితా గానం చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని దుశ్శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రం, పగిడి, పుష్పమాలతో సత్కరించారు

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



కాశీబుగ్గ: రాఖీ ఆకృతిలో రామకృష్ణాపురం సత్యసాయి విద్యార్థులు



టెక్కలి:రూరల్: టెక్కలి సీఐ పి.పైపయ్యకు రాఖీ కడుతున్న విద్యార్థినులు



ఇచ్ఛాపురం రూరల్: అన్నయ్య త్రినాథ్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఎంపీపీ బోర పుష్ప

సోదరీ, సోదరుల అనురాగానికి ప్రతీకగా చెప్పుకునే రాఖీ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. రాఖీలు కట్టేందుకు వచ్చిన అక్క చెల్లెమ్మలతో పట్టణాలు, పల్లెలు కళకళలాడాయి. కొంతమంది తమ తోబుట్టువులు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా రక్షాబంధన్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి.



టెక్కలి: బీఎస్ అండ్ జేఆర్ కళాశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు



ఇచ్ఛాపురం రూరల్: మాజీ ఎంపీపీ మోహనరావుకు రాఖీ కడుతున్న బ్రహ్మ కుమారీ



టెక్కలి: ఎంజేపీ పాఠశాలలో తన సోదరీల దగ్గరకు వచ్చి రాఖీలు కట్టించుకుంటున్న సోదరులు

గంగాధర సేవా సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులకు అభినందిస్తున్న ప్రవాసాంధ్రులు

వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడుకు చెందిన గంగాధర సేవా సంఘం (ప్రవాసాంధ్రుల బిలాయి సంఘం) నూతన కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 18న జరిగాయి. ఈ ఎన్నికల ఓట్లు లెక్కింపు అదే రోజు అర్ధరాత్రి వరకు జరిగాయి. అధ్యక్షులుగా మద్దు పాపారావు, ఉపాధ్యక్షులుగా పప్పు ఎర్రన్న, ప్రధాన కార్యదర్శిగా వడ్డి అప్పారావు, ఉప ప్రధాన కార్యదర్శిగా మద్దు ఆదినారాయణ, ఉప కార్యదర్శిగా వడ్డి కామేశ్వరరావు, కోశాధికారిగా పుక్కళ్ల కామేశ్వరరావు, ఉప కోశాధికారిగా అంబటి కృష్ణ నియమితులయ్యారు. 2027 వరకు ఈ కార్యవర్గం కొనసాగుతుందని ఎన్నికల అధికారి కర్రి ఉమాశంకర్ తెలిపారు.